క్లుప్తంగా

నేడు ఏటికొప్పాకలో విద్యుత్ సరఫరాకు అంతరాయం

యలమంచిలి రూరల్: దార్లపూడి విద్యుత్ కేంద్రం పరిధి 11కేవీ చినగుమ్ములూరు వాటర్ వర్క్స్ ఫీడర్‌కు సంబంధించి ఏబీ స్విచ్ నుంచి ఏటికొప్పాకకు వెళ్లే 11కేవీ లైన్‌లో ఆర్‌డీఎస్ఎస్ పనుల నిమిత్తం గురువారం ఏటికొప్పాక గ్రామానికి ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రాజశేఖర్ ఓ ప్రకటనలో తెలిపారు. వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లకు సంబంధించి అవకాశం ఉన్న ప్రాంతాల్లో ఉదయం 5 నుంచి 10 గంటల వరకు, మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఇవ్వనున్నట్టు పేర్కొన్నారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని ఆయన కోరారు.

దివ్యాంగ విద్యార్థులకు ఆటల పోటీలు



ఆటల పోటీల్లో పాల్గొన్న దివ్యాంగ విద్యార్థులు

నక్కపల్లి: బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని గొడిచర్ల జెడ్పీ ఉన్నత పాఠశాలలో చదువుతున్న దివ్యాంగ విద్యార్థులకు బుధవారం ఆటల పోటీలు నిర్వహించారు. మిగతా విద్యార్థులతో సమానంగా వీరంతా ఆటల పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారని ఉపాధ్యాయురాలు యాస్మిన్ తెలిపారు. విజేతలకు గురువారం బహుమతులు ప్రదానం చేస్తామన్నారు.

వ్యాస రచన పోటీల్లో సత్తా

పాయకరావుపేట: సత్యసాయి సేవా సమితి నిర్వహించిన రాష్ట్ర స్థాయి వ్యాసరచన పోటీల్లో ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు సత్తా చాటారు. విద్యార్థులు మనోజ్ కుమార్, ప్రేమ్ కుమార్, బేబీలు బహుమతులు అందుకున్నట్టు కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ ఎస్.సింహాచలం తెలిపారు. విజేతలను కళాశాల అధ్యాపకులు బుధవారం అభినందించారు.

స.హ చట్టంతో సులువుగా సమాచార సేకరణ

ఎస్.రాయవరం: సమాచార హక్కు చట్టం ద్వారా అధికారులను ఏ సమాచారం అడిగినా సకాలంలో అందజేయాలని తహసీల్దార్ జి.రమేష్‌బాబు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం సమాచార హక్కు చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. తమకు అవసరమైన సమాచారం కోసం ప్రజలు ఈ చట్టం కింద దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈ సమావేశంలో ఇన్‌చార్జ్ ఎంపీడీవో సత్యనారాయణ, ఏవో సౌజన్య పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీల పెంపు ప్రతిపాదన విరమించుకోవాలి

మునగపాక: పెరుగుతున్న నిత్యావసర సరకుల ధరలతో పాటు విద్యుత్ చార్జీల పెంపు ప్రతిపాదనను విరమించుకోవాలని సీపీఎం నాయకులు బ్రహ్మాజీ, శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. సీపీఎం నిర్వహిస్తున్న ప్రజాపోరు కార్యక్రమంలో భాగంగా బుధవారం మునగపాకలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కరెంట్ చార్జీలను పెంచేందుకు యత్నిస్తోందన్నారు. విశాఖ డెయిరీ ఇటీవల ఆవు పాల సేకరణ ధరను తగ్గించిందని, తద్వారా రైతులకు అన్యాయం జరుగుతుందన్నారు. ఈ నేపథ్యంలో సీపీఎం ఆధ్వర్యంలో గురువారం ఆందోళన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

మట్టి అక్రమ తరలింపుపై ఫిర్యాదు

అచ్యుతాపురం: అచ్యుతాపురంలోని ఉప్పు గల్లీలకు సమీపంలోని సర్వే 139లో ఉన్న మట్టిని సమీపంలో ఉన్న ఒక కంపెనీ రోడ్డు విస్తరణ కోసం అక్రమంగా తరలించుకుపోతున్నారంటూ పూడిమడకకు చెందిన మత్స్యకారులు తహశీల్దార్‌కు బుధవారం ఫిర్యాదు చేశారు. తమ ప్రాంతంలో అత్యంత కీలకమైన మట్టిదిబ్బలను తరలిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వాసుపల్లి శ్రీనివాసరావు, ఉమ్మిడి జగన్, ఉమ్మిడి అప్పారావు, చోడపల్లి శ్రీను కోరారు.

సమస్యల పరిష్కారానికి వినతి

మునగపాక: ప్రజా సమస్యల పరిష్కారానికి పాటుపడాలని కోరుతూ బుధవారం తహసీల్దార్ ఆదిమహేశ్వరరావుకు బీజేపీ నేతలు వినతి పత్రం అందజేశారు. ఇటీవల బాధ్యతలు చేపట్టిన తహసీల్దార్‌ను ఆ పార్టీ నేతలు శాలువాతో కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా రెవెన్యూ పరమైన సమస్యల పరిష్కారానికి శక్తివంచన లేకుండా కృషి చేయాలని నాయకులు కోరారు. పార్టీ మండల అధ్యక్షుడు యల్లపు రాజేశ్వరరావు, నాయకులు మళ్ల కాలేశ్వరరావు, బొడ్డేడ భాస్కరరావు, సత్యనారాయణ పాల్గొన్నారు.

వ్యవసాయ కార్యాలయం దయనీయం.!

- శిథిల స్థితిలో రాంబిల్లి మండల వ్యవసాయ కార్యాలయ భవనం
- నిలువ నీడ లేక ఇబ్బందులు పడుతున్న వ్యవసాయాధికారులు
- కార్యాలయంలో విలువైన రికార్డులు, ఫర్నిచర్ చెదలు పాలు
- మండలంలో పూర్తికాని రైతు సేవా కేంద్రాల నిర్మాణం



హరిపురంలో అసంపూర్తిగా నిలిచిపోయిన రైతు సేవా కేంద్రం నిర్మాణం

రాంబిల్లి(యలమంచిలి): రాంబిల్లి మండల కేంద్రంలో ఉన్న వ్యవసాయ శాఖ కార్యాలయ భవనం శిథిలావస్థకు చేరుకుంది. విలువైన రికార్డులు, ఫర్నిచర్, కంప్యూటర్ పరికరాలు, రైతులకు పరిశోధనాత్మకంగా సూచనలు అందించే పరికరాలు చెదలు పట్టి శిథిల భవనంలో మూలుగుతున్నాయి. మరోవైపు ఈ భవనంలో విధులు నిర్వహించలేక.. సొంత భవనం లేక మండల వ్యవసాయాధికారులు పరాయి పంచన తలదాచుకుంటున్న పరిస్థితులు నెలకొన్నాయి. స్థానిక తహసీల్దారు కార్యాలయం వాటర్ ట్యాంక్ పక్కన ఉన్న వ్యవసాయ శాఖ కార్యాలయ భవనం కొన్నేళ్లుగా శిథిల స్థితిలో ఉంది. మండల కేంద్రంలో ప్రధాన కార్యాలయం లేకపోవడంతో వ్యవసాయాధికారులు ఎక్కడ ఉంటారో తెలియని పరిస్థితి ఎదురవుతోంది. గతంలో వ్యవసాయ కార్యాలయం ఆవరణలో విత్తనాలు నిల్వ చేసే గొడౌన్ కూడా మూలకు చేరింది. దీంతో రైతులకు సకాలంలో విత్తనాలు అందడం లేదు. విత్తనాలు ఎక్కడ ఉంటాయో వ్యవసాయాధికారులను అడిగి తెచ్చుకోవాల్సిన పరిస్థితి నెలకొందని రైతులు చెబుతున్నారు. రైతులకు ప్రభుత్వపరమైన వ్యవసాయ సూచనలు, శిక్షణ కార్యక్రమాల నిర్వహణకు మండలంలో ఇబ్బందులు తలెత్తుతున్నాయి.



శిథిలావస్థలో రాంబిల్లి వ్యవసాయ కార్యాలయ భవనం

అసంపూర్తిగా రైతు భరోసా కేంద్రాల నిర్మాణం

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మండలంలో నిర్మించిన రైతు భరోసా కేంద్రాలు(ఆర్‌బీకే) అక్కరకు రాకుండాపోయాయి. లక్షలు వెచ్చించి నిర్మించిన భవనాలు అలంకారప్రాయంగా మిగులుతున్నాయి. కేంద్రంలోని అధిక ధరలు కలిగిన పరికరాలు మూలన పడ్డాయి. మరికొన్ని భవనాలు నిర్మాణ దశలోనే ఉన్నాయి. రాంబిల్లి మండలంలో ప్రస్తుతం రాంబిల్లి, గోవిందపాలెం గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాలు నిర్మాణాలు పూర్తి చేసుకున్నాయి. మిగతా గ్రామాల్లో నిర్మాణ దశలోనే అసంపూర్తిగా నిలిచిపోయాయి. ఆయా కేంద్రాల సిబ్బంది గ్రామాల్లో పరాయి పంచన విధులు నిర్వర్తిస్తున్న పరిస్థితులు నెలకొన్నాయి. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాలను రైతు సేవా కేంద్రాలుగా పేరు మార్చింది. అంతే తప్ప ఆయా భవనాల నిర్మాణాల పూర్తికి ఎటువంటి నిధులు కేటాయించడం లేదు. దీంతో రైతులకు ప్రస్తుతం వ్యవసాయ రైతు సేవా కేంద్రాలు పూర్తి స్థాయిలో అందుబాటులో లేకుండాపోయాయి. సిబ్బంది కూడా చాలీచాలని గదుల్లో విధులు నిర్వర్తిస్తున్నారు. గ్రామాల్లో విత్తనాలు, ఎరువులు నిల్వలు లేక సకాలంలో రైతులకు అధికారులు అందించలేకపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు వ్యవసాయ రైతు సేవా కేంద్రాల భవనాల నిర్మాణంపై దృష్టి సారించాలని రైతులు కోరుతున్నారు.

శాశ్వత కార్యాలయం ఏర్పాటు చేయాలి



రాంబిల్లి మండల కేంద్రంలో వ్యవసాయాధికారి కార్యాలయం పూర్తిగా శిథిలమైపోయింది. విత్తనాలు, ఎరువులు నిల్వలకు గొడౌన్ లేకుండాపోయింది. మండల కేంద్రంలో వ్యవసాయ కార్యాలయం లేక అధికారులు ఎక్కడ ఉంటారో తెలియని పరిస్థితి నెలకొంది. తక్షణం శాశ్వత వ్యవసాయ కార్యాలయం ఏర్పాటు చేయాలి. అసంపూర్తిగా ఉన్న ఆర్‌బీకేలను తక్షణం పూర్తి చేయాలి.

– ధూళి రమణ, రైతు, భోగాపురం గ్రామం

విత్తనాలు, ఎరువులు అందడం లేదు



వ్యవసాయ కార్యాలయం లేక అయాధికారులు ఎక్కడ ఉంటారో తెలియడం లేదు. ఫోన్‌లో సంప్రదించడం తప్పా, వ్యవసాయ కార్యాలయానికి వెళ్లడం, పంట తాలుకా స్థితిగతులు తెలుసుకోవడం, విత్తనాలు, ఎరువులు తెచ్చుకోవడం ఇబ్బందికరంగా మారింది. ఎరువులు, విత్తనాల కోసం కొప్పుగుండుపాలెం గ్రామం వెళ్లాల్సి వస్తుంది. మండల కేంద్రంలో వ్యవసాయ కార్యాలయం, ఎరువులు, విత్తనాల గొడౌన్ ఏర్పాటు చేస్తే బాగుంటుంది.

– రమణారావు, రైతు, కొత్తూరు గ్రామం

కార్యాలయం లేక ఇబ్బందులు

రాంబిల్లి మండల కేంద్రంలో ఉన్న వ్యవసాయాధికారి కార్యాలయం శిథిలావస్థకు చేరుకుంది. కార్యాలయంలో విలువైన రికార్డులు, ఫర్నిచర్, పరికరాలు భవనంలోనే ఉండిపోయాయి. సొంత భవనం లేక ఎక్కడ విధులు నిర్వహించాలలో అర్థం కాక గ్రామాల్లో ఉన్న రైతు సేవా కేంద్రాలు వద్ద ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. భవనం వద్ద ఉన్న గొడౌన్ పూర్తిగా శిథిలమైపోయింది. అధికారులకు, ప్రజాప్రతినిధులకు చెబుతున్నాం. కొత్త కార్యాలయం నిర్మాణం చేపట్టాలి. అంత వరకు ప్రత్యేక భవనాన్ని కేటాయించాలి.

– సిహెచ్.సుమంత, రాంబిల్లి మండల వ్యవసాయాధికారి

ఘనంగా సారె ఊరేగింపు



ఎర్రవరంలో సారెను ఊరేగిస్తున్న భక్తులు

అచ్యుతాపురం: మండలంలోని ఎర్రవరం గ్రామంలో బుధవారం గౌరీ పరమేశ్వరుల సారె ఊరేగింపు ఘనంగా జరిగింది. గ్రామ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో పలు రకాల పిండి వంటలను ముత్తయిదువులు తలపై పెట్టుకుని ఊరేగించి గౌరీపరమేశ్వరులకు సమర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

నేటి నుంచి గుమ్మడి అమ్మలు పేరంటాలు జాతర



గుమ్మడి అమ్మలు పేరంటాలు

రాంబిల్లి(యలమంచిలి): కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా విరాజిల్లుతున్న రాంబిల్లి మండలం కొత్తూరులో కొలువైన గుమ్మడి అమ్మలు పేరంటాలు అమ్మవారి జాతర గురు, శుక్రవారాల్లో ఘనంగా జరిపించేందుకు ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇప్పటికే అమ్మవారి ఆలయానికి పెయింటింగ్ వేసి, విద్యుత్ దీపాలంకరణలతో ముస్తాబు చేశారు. స్వగ్రామమైన కొత్తూరులో యలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ కుటుంబ సభ్యులు గుమ్మడి అమ్మలు పేరంటాలకు తొలి పూజ చేసి ఉత్సవాలను గురువారం సాయంత్రం ప్రారంభించనున్నారు. శుక్రవారం ప్రధాన జాతరలో భాగంగా మేళతాళాల మధ్య గ్రామంలో అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగించనున్నారు. మధ్యాహ్నం భారీ అన్నసమారాధన జరగనుంది. జాతర సందర్భంగా రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు.

గ్రామాల అభివృద్ధికి సమన్వయం అవసరం



నక్కపల్లి సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా పంచాయతీ అధికారి శిరీషరాణి

నక్కపల్లి: అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేసి, గ్రామాలను అభివృద్ధి చేయాలని జిల్లా పంచాయతీ అధికారి శిరీషరాణి సూచించారు. బుధవారం నక్కపల్లిలో సర్పంచ్, ఎంపీటీసీలతో గ్రామాభివృద్ధి ప్రణాళిక తయారీపై నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. పంచాయతీల్లో చేపట్టే పనులకు ముందుగా ప్రణాళిక తయారీ చేయడం ఎంతో అవసరమన్నారు. గ్రామ సభలు ఏర్పాటు చేసి ప్రజలు ఆమోదంతో పనులు గుర్తించాలన్నారు. పంచాయతీల ఆదాయ వనరులను సక్రమంగా సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిల్లా పరిషత్, మండల పరిషత్, ఉపాధి హామీ నిధులు కూడా కేటాయిస్తామని, వీటితో ప్రజలకు అవసరమయ్యే కనీస సదుపాయాలు కల్పించాల్సిన బాధ్యత పంచాయతీలపై ఉందన్నారు. నిధులు వినియోగం జమా ఖర్చులు విషయంలో పారదర్శకత ఉండాలన్నారు. ఈ సమావేశంలో డీఎల్‌పీవో మూర్తి, ఎంపీడీవో సీతారామరాజు, ఎంపీపీ ఏనుగుపల్లి రత్నం, వైస్ ఎంపీపీలు వీసం నానాజీ, వెలగ ఈశ్వరరావు, రిసోర్స్ పర్సన్ బీఏబీఎల్ మూర్తి పాల్గొన్నారు.

రాంబిల్లి(యలమంచిలి): పంచాయతీల అభివృద్ధికి సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ప్రణాళిక పరమైన లక్ష్యంలో ముందుకు సాగాలని ఎంపీడీవో ఎస్.జయమాధురి సూచించారు. బుధవారం రాంబిల్లిలో జరిగిన శిక్షణ తరగతిలో ఆమె మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గొట్టుముక్కల శిరీష, జెడ్పీటీసీ సభ్యుడు ధూళి నాగరాజు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

మునగపాక: గ్రామాల్లో అభివృద్ధి పనులపై సర్పంచ్‌లు, ఎంపీటీసీలు దృష్టి సారించాలని ఎంపీడీవో ఎం.ఉషారాణి కోరారు. మండల పరిషత్ హాలులో బుధవారం సర్పంచ్‌లు, ఎంపీటీసీలకు గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళికలకు సంబంధించి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో కనీస మౌలిక వసతులు కల్పించేందుకు పాటుపడాలన్నారు. పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులకు ఇచ్చే వేతనం చాలడం లేదంటున్న విషయాన్ని చూచుకొండ సర్పంచ్ సూరప్పారావు అధికారుల దృష్టికి తీసుకురాగా.. ప్రతి ఇంటి నుంచి రోజుకు రూపాయి వంతున వసూలు చేసుకోవాలన్నారు. ఎంపీపీ మళ్ల జయలక్ష్మి, ఏవో ప్రసాద్, ఈవోఆర్డీ సోమరాజు, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు కాండ్రేగుల నూకరాజు, ప్రధాన కార్యదర్శి సుందరపు తాతాజీ, తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

రసాభాసగా పాములవాక గ్రామసభ



పాములవాకలో గ్రామసభ నిర్వహిస్తున్న ఏపీవో నాగరాజు

కోటవురట్ల: పాములవాకలో బుధవారం జరిగిన ఉపాధి హామీ పథకం గ్రామసభ రసాభాసగా సాగింది. పలు అంశాలపై సర్పంచ్ డి.సత్యవతి, మాజీ సర్పంచ్ కిల్లాడ శ్రీనివాసరావు అధికారులను నిలదీశారు. ఏపీవో నాగరాజు పశువుల షెడ్ల మంజూరు గురించి వివరిస్తుండగా.. మాజీ సర్పంచ్ శ్రీనివాసరావు అడ్డుపడి ఏవిధంగా మంజూరు చేశారో చెప్పాలని పట్టుపట్టారు. గతంలో నిర్వహించిన గ్రామ సభలో పశువుల షెడ్ల కోసం 30 మంది రైతులు దరఖాస్తు చేయగా.. ముగ్గుర్ని మాత్రం ఏ ప్రాతిపదికన ఎంపిక చేశారో చెప్పాలని నిలదీశారు. టీడీపీ నాయకులు జోక్యం చేసుకోవడంతో వాగ్వాదం జరిగింది. అధికారుల తీరును నిరసిస్తూ సర్పంచ్ సత్యవతి, పలువురు గ్రామస్తులు గ్రామసభను బహిష్కరించారు. మాజీ సర్పంచ్ శ్రీనివాసరావు మాట్లాడుతూ సర్పంచ్ ప్రమేయం లేకుండా ఉపాధి హామీ పథకానికి సంబంధించి సీసీ రోడ్లు, వెండర్ రిజిస్ట్రేషన్ లేకుండా అధికారులు ఇష్టారాజ్యంగా ఆమోదిస్తున్నారని ఆరోపించారు. జాతీయ ఉపాధి హామీ పథకం నియమ నిబంధనల ప్రకారం సర్పంచ్ ఆధ్వర్యంలో మాత్రమే పనులు జరగాల్సి ఉంటుందన్నారు. అలా కాకుండా టీడీపీ నాయకుల ప్రమేయంతో అధికారులు తమకు నచ్చినట్టు చేస్తున్నారని ఆరోపించారు.

మాదక ద్రవ్యాలకు అలవాటు పడొద్దు



మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న యలమంచిలి ఎస్‌ఐ సావిత్రి



విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న అచ్యుతాపురం సీఐ గణేశ్

యలమంచిలి రూరల్: మాదక ద్రవ్యాలకు అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని యలమంచిలి పట్టణ ఎస్‌ఐ కె.సావిత్రి సూచించారు. జిల్లాను డ్రగ్స్ రహితంగా తీర్చిదిద్దడంలో భాగంగా బుధవారం పట్టణంలోని గీతాంజలి, వాగ్దేవి కళాశాలల్లో జరిగిన అవగాహన సదస్సుల్లో ఆమె మాట్లాడారు. డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాల వినియోగం, అక్రమ రవాణాకు సంబంధించి ఎవరికైనా సమాచరం తెలిస్తే పోలీసు శాఖ ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మొబైల్ నంబరు 93929 18196కు ఫోన్ కాల్ గానీ, వాట్సాప్ ద్వారా గానీ తెలియజేయాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. చాపకింద నీరులా విస్తరిస్తున్న డ్రగ్స్ మహమ్మారిని పారద్రోలడానికి పోలీసులతో పాటు సమాజంలో అన్ని వర్గాల వారు కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం విద్యార్థులతో డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఆయా కళాశాలల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్.రాయవరం: యువత చెడు వ్యసనాలకు బానిసలు కావద్దని ఎస్.రాయవరం ఎస్‌ఐ విభీషణరావు అన్నారు. నర్సీపట్నం రోడ్డు రైల్వే స్టేషన్ వద్ద ప్రయివేటు ఐటీఐ కళాశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత మాదక ద్రవ్యాలకు అలవాటు పడితే జీవితాలు సర్వనాశనం అవుతాయన్నారు. డ్రగ్స్, గంజాయి, వంటి సరఫరా సమాచారం తెలిస్తే వెంటనే తెలియజేయాలని కోరారు.

అచ్యుతాపురం: విద్యార్థులు చెడు వ్యసనాలకు గురికావద్దని అచ్యుతాపురం సీఐ నమ్మి గణేశ్ సూచించారు. మండలంలోని శ్రీకైట్స్ కళాశాలలో నిర్వహించిన సంకల్పం సదస్సులో ఆయన విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. మద్యానికి, మాదక ద్రవ్యాలకు విద్యార్థులు అలవాటు పడి బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని సూచించారు.

పీఆర్‌సీ కమిషనర్‌ను నియమించాలి

కోటవురట్ల: రాష్ట్ర ప్రభుత్వం పీఆర్‌సీకి సంబంధించి వెంటనే కమిషనర్‌ను నియమించాలని యూటీఎఫ్ మండల అధ్యక్షుడు జె.నరసింగరావు డిమాండ్ చేశారు. మండలంలో యూటీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. పలు పాఠశాలలను సందర్శించి సమస్యలు తెలుసుకోవడంతో పాటు సభ్యత్వాలు నమోదు చేశారు. ఈ సందర్భంగా నరసింగరావు మాట్లాడుతూ కొత్త కమిషనర్‌ను నియమించకపోవడంతో ఉపాధ్యాయులు ఆర్థికంగా నష్టపోయే పరిస్థితి ఉందన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చి దాదాపు 5 నెలలు పూర్తయినా ఈ విషయమై స్పందించకపోవడం దారుణమన్నారు.

రెవెన్యూ సదస్సులతో సమస్యల పరిష్కారం

మునగపాక: రెవెన్యూ సదస్సుల ద్వారా రైతుల సమస్యలు పరిష్కారమవుతాయని తహసీల్దార్ ఎస్.ఆదిమహేశ్వరరావు అన్నారు. మండలంలోని చల్లపలలో బుధవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రీ-సర్వేలో జరిగిన లోపాలను సవరించేందుకు ఇటువంటి సదస్సులు దోహదపడతాయన్నారు. ఆర్‌ఐ కిషోర్‌కుమార్, రీ-సర్వే డీటీ పడాల్, పలువురు రైతులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

బంగారం, నగదు చోరీ



మంచంపై చెల్లాచెదురుగా ఉన్న వస్తువులు

కోటవురట్ల: లింగాపురంలోని ఓ ఇంట్లో దొంగలు పడి సుమారు 26 గ్రాముల బంగారం, రూ.5వేల నగదు అపహరించారు. ఎస్‌ఐ నారాయణరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. లింగాపురానికి చెందిన చింతల నాగరాజు కోటవురట్లలో నూడిల్స్ వ్యాపారం చేస్తుంటాడు. మంగళవారం సాయంత్రం నాలుగు గంటల సమయంలో వ్యాపారం నిమిత్తం భార్య వరలక్ష్మితో కలిసి కోటవురట్లకు వెళ్లాడు. ఇదే అదనుగా దొంగలు ఇంటి తాళం పగలగొట్టి లోపలికి ప్రవేశించి బీరువాలో దాచి ఉంచిన 11 తులాల బంగారం, రూ.5 వేలు నగదు అపహరించారు. అయితే హడావుడిలో అపహరించుకుపోతున్న బంగారంలో సుమారు 9 తులాలు బంగారు ఆభరణాలు ఆ ఇంటి పెరటిలోనే జారిపడిపోయాయి. వ్యాపారం ముగించుకుని రాత్రి 10 గంటల సమయంలో ఇంటికి తిరిగొచ్చిన నాగరాజు, వరలక్ష్మిలు ఇంటి తలుపులు తెరిచి ఉండడాన్ని గమనించి కంగారుగా లోపలికి వెళ్లి చూశారు. బీరువా తలుపులు తెరిచి ఉండడంతో పాటు, మంచంపై చెల్లాచెదరుగా వస్తువులు పడివున్నాయి. బీరువాలో పరిశీలించగా దాచి ఉంచిన బంగారు ఆభరణాలు కనిపించలేదు. ఇంటి పెరటిలో వెతకగా కొంత బంగారం కనిపించింది. వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. భార్య వరలక్ష్మి ఫిర్యాదు మేరకు సుమారు 26 గ్రాముల బంగారం, రూ.5 వేల నగదు చోరీకి గురయ్యాయని కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ రమేష్ తెలిపారు. బుధవారం ఉదయం క్లూస్ టీమ్ సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించింది. ఇంటి పెరటిలో రెండు పెంపుడు కుక్కలు ఉన్నప్పటికీ చోరీ జరగడం చర్చనీయాంశమైంది.

వలస కార్మికులకు రక్షణ కల్పించాలి

రాంబిల్లి(యలమంచిలి): రాంబిల్లి ఎన్‌ఏవోబీ నేవల్ బేస్‌లో పని చేస్తున్న వలస కార్మికులకు యాజమాన్యాలు రక్షణ కల్పించాలని రాంబిల్లి నేవల్‌బేస్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు జి.దేముడునాయుడు డిమాండ్ చేశారు. బుధవారం ఆయన మాట్లాడుతూ యాజమాన్యాల నిర్లక్ష్యం వల్ల కార్మికులు ప్రాణాలు కోల్పోతున్నారని ఆరోపించారు. రాంబిల్లి మండలంలోని నేవల్ బేస్ ప్రాజెక్ట్ నిర్మాణంలో ఐటీడీసీ కన్‌స్ట్రక్షన్ కంపెనీలో వెల్డర్‌గా పనిచేస్తున్న బిహార్‌కు చెందిన కాంట్రాక్ట్ కార్మికుడు బప్పుఖాన్(41)బుధవారం బుధవారం మృతి చెందాడని తెలిపారు. గుండెపోటు రావడంతో ఆస్పత్రికి తీసుకువెళుతుండగా మార్గమధ్యంలో మృతిచెందాడని యాజమాన్యం చెబుతోందన్నారు. మరో నిర్మాణ సంస్థ కేఈసీ కంపెనీలో పశ్చిమబెంగాల్ రాష్ట్రానికి చెందిన రాజ్‌కుమార్ మండల్ రెండు రోజుల క్రితం మృతి చెందాడని, మృతదేహం నుంచి దుర్వాసన వచ్చేంత వరకు యాజమాన్యం పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిందని తెలిపారు. కార్మికులకు రక్షణ కల్పించని యాజమాన్యాలపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎన్‌ఏవోబీ కాంపౌండ్ వాల్ లోపల పలు రాష్ట్రాలకు చెందిన 9,200 మంది కార్మికులతో ఐటీడీసీ, ఎల్అండ్‌టీ, కేఈసీ వంటి కంపెనీలు పనులు చేయిస్తున్నాయని, వారికి కనీస సౌకర్యాలు కల్పించడం లేదని ఆరోపించారు. జిల్లా కార్మిక శాఖ అధికారులు, కలెక్టర్ సమగ్రంగా విచారణ జరిపి మృతుల కుటుంబాలకు యాజమాన్యాల ద్వారా రూ.50 లక్షల చొప్పున పరిహారం అందజేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నేతలు సీహెచ్ గంగరాజు,సీహెచ్ అప్పలరాజు,కాసియా తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

మునగపాక: మునగపాక శాఖా గ్రంథాలయంలో గురువారం నుంచి జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్టు గ్రంథాలయాధికారి రమణ ఒక ప్రకటనలో తెలిపారు. 14న ఉదయం వారోత్సవాల కార్యక్రమం ప్రారంభిస్తామన్నారు. 15న పుస్తక ప్రదర్శన, వక్తృత్వ పోటీలు, 16న కవి సమ్మేళనం, సభ్యత్వ సేకరణ, 17న చిత్రలేఖన పోటీలు, 18న వ్యాసరచన పోటీలు ఉంటాయన్నారు. 19న మహిళా దినోత్సవంలో భాగంగా బాలికలకు ఆటల పోటీలు, 20న ముగింపు కార్యక్రమంలో భాగంగా బహుమతులు ప్రదానం చేస్తామన్నారు.

వారోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

కోటవురట్ల: స్థానిక శాఖా గ్రంథాలయంలో గురువారం నుంచి గ్రంథాలయ వారోత్సవాలను నిర్వహించనున్నట్టు గ్రంథాలయాధికారి అప్పలనాయుడు తెలిపారు. ఈ మేరకు ఎంఈవో-2 శ్రీజోష్‌ను, స్థానిక ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులను బుధవారం కలిసి వారోత్సవాలను విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఆయా పాఠశాలల్లో కరపత్రాలను ఆవిష్కరించారు.

యలమంచిలి శాఖా గ్రంథాలయంలో..

యలమంచిలి రూరల్: స్థానిక శాఖా గ్రంథాలయంలో గురువారం నుంచి గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించనున్నట్టు గ్రంథాలయాధికారి వి.ఆనంద్ ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం గ్రంథాలయం ఆవరణలో పతాకావిష్కరణ, శుక్రవారం పుస్తక ప్రదర్శన, సభ్యత్వ సేకరణ, ఈ నెల 16న గ్రంథాలయ ఉద్యమకారుల సంస్మరణ దినోత్సవం, చిత్రలేఖనం పోటీలు, 17న గ్రంథాలయాల అభివృద్ధిలో విద్యార్థుల పాత్ర అంశంపై 6, 7, 8, 9, 10 తరగతుల విద్యార్థులకు, ప్రకృతి వైపరీత్యాలు–తీసుకోవాల్సిన జాగ్రత్తలు అనే అంశంపై కళాశాల విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహిస్తామన్నారు. 18న హైస్కూల్ విద్యార్థులకు క్విజ్, సెల్‌ఫోన్-యువతపై ప్రభావం అనే అంశంపై కళాశాల విద్యార్థులకు వక్తృత్వ పోటీలు, సాయంత్రం కవి సమ్మేళనం, ఈ నెల 19న పాటల పోటీలు, 20న ముగింపు సభ, బహుమతి ప్రదానం ఉంటాయని ఆయన తెలిపారు.

ఆదాయ వనరులను నమోదు చేయండి

పాయకరావుపేట: పంచాయతీకి వచ్చే ఆదాయ వనరులను కంప్యూటరీకరణ చేయాలని ఈవోఆర్‌డీ సిహెచ్.చంద్రశేఖర్ సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం గ్రామ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి పంచాయతీని స్వర్ణ గ్రామ పంచాయతీగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఈ సమావేశంలో ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది రాజు, ఆయా గ్రామాల కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.